# సింహాద్రి స్వీట్ హోం

సింహాద్రి లాంటి గుమాస్తాకి ఇంటా బయటాకూడా శత్రువులుంటారు. బయటి శత్రువులు అప్పులవాళ్లూ. ఆఫీసు బాసూ వగైరా అయితే ఇంట్లో శత్రువులు పెళ్ళామూ, పిల్లలూ! స్టంటుసినిమాలో హీరో శత్రువుల్ని చితకదన్నినట్లు.... వీళ్ళందర్నీ చితకతన్నాలన్న కోర్కె సింహాద్రికి ఏకోశానా లేదు. శత్రువు చేతికి చిక్కి, చితకపొడిపించుకునే దుర్దశ కలక్కపోతే తనపాలిటికి అదే విజయం!

పోలీసు కుక్కలు నేరస్తుల్ని పసిగట్టినంత సులభంగా శత్రువులు తనమీద ఎప్పుడు ఏ విధంగా దాడి ప్రారంభిస్తారో—సింహాద్రి పసిగట్ట గలడు. ఆ పసిగట్టే గుణమే సింహాద్రికి ఒకోసారి శ్రీరామరక్ష!

ఆదివారంపూట భోంచేస్తుండగా. సింహాద్రికి చటుక్కున దాడి జరిగే వాసన కొట్టింది. సింహాద్రి భార్య కుమారీ శతకంతోపాటు భారత రామాయణాలు చదువుకున్న ఉత్తమ యిల్లాలు! ఆవిడకు ధర్మాధర్మాలు కరతలామలకం. సాధారణంగా ఆవిడ సింహాద్రిమీద ఆదివారం రోజు యుద్ధం ప్రకటిస్తుంది. మిగతా రోజుల్లో బయటి శత్రువులు వుంటారు వారితోబాటు తనూ తలపడితే అధర్మ యుద్ధమౌతుంది. ఆదివారం రోజయినా, భోంచేసేటప్పుడు దాడి చెయ్యదు. ఆ విషయం సింహాద్రికి కూడా రూఢిగా తెలుసు.

కాసేపట్లో దాడి జరుగుతుందని తెలిశాక, సింహాద్రికి తింటున్న మెతుకులు మింగుడుపడలేదు, పొరబొయ్యాడు. ఆవిడ సానుభూతి ఆశించి, వచ్చిన దగ్గుకంటే ఒక మోతాదు ఎక్కువే దగాడు. "అయ్యో పొరబొయ్యారా? మంచినీళ్లు త్రాగండి" అంటుందేమోననుకున్నాడు. ఆ యిల్లాలు బెల్లంకొట్టిన రాయిలాచూస్తూ నిలబడ్డదేతప్ప—ఒక్క మాట మాట్లాడ లేదు. అంటే శత్రువు పట్టపగలింటి సూర్యుని పగిది మండుతున్నదన్న

మాట! సింహాద్రికి ముచ్చెమటలు ముంచెత్తిపోశాయి. గబగబా నాలుగు మెతుకులు కొరికి చెయ్యి కడుక్కున్నాడు. బయట ఎండ మండుతోంది. రథం ఎక్కడికి మరల్చాలో బోధపడలేదు. గబుక్కున మంచంమీదపడి ముసుగు ముఖందాకా లాక్కున్నాడు. అది సింహాద్రి చేతిలోవున్న సమ్మోహనాస్త్రం. శత్రువు బారినుండి రెండు మూడు గంటలు రక్షిస్తుంది ఇంతలో కాక తగ్గి, శత్రువు కొంత చల్లబడినా చల్లబడవచ్చు. ఆ దశలో శత్రువు వళ్ళంతా జల్లెడగండ్లు పడేట్టు కొట్టలేదు.

సింహాద్రిభార్య భోంచేసి. సింహాద్రి దగ్గరకొచ్చింది. అడుగుల చప్పుడు వినగానే సింహాద్రి గట్టిగా కళ్లు మూసుకున్నాడు. నిద్రపోతు న్నట్టు నటిస్తున్న తన్నుచూచి ఆవిడ ముఖంలో ఏ భావాలు కదిలాయో సింహాద్రికి వూహించడానికికూడా ధైర్యం చాల్లేదు.

సింహాద్రి నిద్రపోవాలని గట్టి ప్రయత్నమే చేశాడు. ప్రయత్నం చేసిన కొద్దీ అది దూరానికే పోతోంది—తన ప్రమోషన్‌లాగ. దేనికైనా పెట్టిపుట్టాలి. సింహాద్రి మసలి క్రీగంటితో వసారాలోకి చూశాడు. తను ఆశించినట్టు, ఆమె పడుకొని—ఓ చిన్న కునుకు తీసే ప్రయత్నం ఏదీ చేస్తున్నట్టులేదు, ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నది. సింహాద్రి ఆశిం చింది ఏది జరిగింది గనక జీవితంలో ఇది జరగడానికి?

కాసేపుంటే సింహాద్రి ఆశ నెరవేరేది నిజంగానే రాధ ఆవులించి పడుకోబోతున్నది. ఇంతలోకే పక్కింటి పార్వతమ్మ వచ్చింది. ఆవిడ జిడ్డు, ఒకమయాన వదలదు. గంటలకు గంటలు చెత్తంతా మాట్లాడు తుంది. ఆవిడ సవ్వడి వింటూనే సింహాద్రి బిక్కచచ్చిపోయాడు. ఇక తనకు విముక్తిలేదు. ఆవిడ ఇప్పుడే వదలదు.

సింహాద్రి ఊహ కరెక్టే, పార్వతమ్మ సంభాషణని తెగసాగ దీస్తోంది, సీరియల్‌లాగ, రేషనుబియ్యం మొదలుకొని రేపు విడుదల కాబోతున్న సినిమావరకూ. దేన్నీ వదలకుండా అన్నిటిమీదా మాట్లాడు తోంది. మాట్లాడటానికి కడకు ఏమీ మిగలనట్లు వుంది, సింహాద్రి ఇంటి విషయాల్లోకి దిగింది.

"అన్నట్టు అడగటం మరచేను, కళ్యాణి అత్తగారింటికి వెళ్ళిందటే?" అన్నది.

"వెళ్ళలేదు పిన్నీ. నిన్నా ఇవ్వాళా మంచి దినాలు కావట. రేపో ఎల్లుండో పంపాలనుకుంటున్నాము."

"నిజమేలేవే రాధా, ప్రయాణమన్నాక ఓపినన్ని యిబ్బందులు."

"ఇబ్బందులేమున్నయ్ పిన్నీ, దానికి కావలసిన చీరెలూ అవీ వారం కిందటే కొన్నాము. మంచిరోజు చూసి అది ఎప్పుడైనా వెళ్ళొచ్చు."

"అది సరేగానీ, విజయకి యీ చైత్రంలో నన్నా పెళ్ళి చెయ్యరూ ?" అన్నది పార్వతమ్మ.

"చెయ్యాలి పిన్నీ. అయినప్పుడు అవుతుంది లెమ్మని నిబ్బరంగా కూచోవడానికి మగపిల్లవాడు గనకనా ? చూస్తూనే వున్నావుగా బరువు దించుకోవాలని యమయాతన పడుతున్నాం. ఆయనకు సంబంధాలు ఒకంతట నచ్చవు ఆస్తి, చదువు, అందం అన్నీ వుండాలంటాడు. డబ్బుదేముంది ? ఎలాగూ దానికొరకు ఐదువేలు ముడుపు కట్టుకొనే వున్నాం. ముడుపు చెల్లించందే మొక్కుబడి తీరదుకదా ;"

"నిజమేలేమ్మా. పెళ్ళంటే మాటలా ? నూరేళ్ళ పంట. తొందర పడితే అయ్యే పనికాదు. అన్నట్టు వచ్చినపని మరచి మాటల్లో పడ్డాను. కాసింత కాఫీపొడి వుంటే పెడుదూ, మళ్ళీ రేపు తెచ్చిపెడతాను" అన్నది.

"అయ్యో, అదే అడిగావ్? ఉదయం పిల్లవాణ్ణి పంపి కాఫీపొడి తెమ్మంటే. వాడికి తెలీక, చికోరి కలిపింది తెచ్చాడు అది ఆయన తాగడు. అందుకని టిన్ను మూతకూడా విప్పలేదు. దాన్ని వాపస్‌చేసి ప్యూర్ కాఫీ తెప్పించాలి. ఆయన లేస్తాడేమోనని చూస్తున్నాను పిన్నీ" అన్నది రాధ.

సింహాద్రి పడుకునే పళ్ళు నూరేడు కాఫీపొడికొచ్చింది, కాఫీపొడి అడక్క గంటనుంచి అనవసర ప్రసంగం చేస్తోంది. ధనియాల జాతి! ఖర్చు చెయ్యడంలో వున్న పొదుపు, మాటల్లో వుండదు. నోటికొచ్చిందల్లా వాగడమే పని!

మాటలు వినిపించకపోయేసరికి. పార్వతమ్మ కాఫీపొడికి మరో ఇంటికి వెళ్ళినట్టు సింహాద్రి వూహించగలిగేడు. రాధ లేచి ఇంట్లోకి వెళ్ళడమో. పడుకోవడమో, చేస్తే బాగుండునని సింహాద్రి ఆశ. గరళం కంఠంలో నిల్పి బాధపడ్డ పరమశివుని దురవస్థ ప్రాప్తించింది తనకు.

"ఏమిటే యిలా వచ్చావు ?" రాధ ప్రశ్నిస్తోంది.

సింహాద్రికి నెత్తిమీద పిడుగు పడ్డట్లే అయింది. మళ్ళా ఎవరో దాపురించేరు. కళ్ళు సగం తెరచి చూచేడు. వచ్చినవాడు ఫల్గుణు డన్నట్ట యింది సింహాద్రిపని ! అది పనిమనిషి ఎల్లమ్మ. పార్వతమ్మకన్నా నాలు గాకులు ఎక్కువే చదివింది. దాన్ని వదిలించుకోవడం మాటలు కాదు. అదీగాక దీన్ని వదిలించుకోవాలని రాధ చూస్తుందని నమ్మకమేమిటి ? సింహాద్రి గుటకలు మింగేడు. అన్నం తింటూనే ఎండ అనుకోకుండా బజార్లమీద పడవలసింది. ఏ ఆరింటికో ఇంటికివస్తే సరిపోయేది.

"రేత్తిరి నుంచి పస్తున్నాం, రెండ్రూపాయ లుంటే ఇయ్యాం డమ్మా, మీకు పున్నెముంటుంది" ఎల్లమ్మ బతిమాలుతోంది.

"నా దగ్గిర ఎక్కడిదే డబ్బు, అయ్యగారన్నా మేలుకొనివుంటే అడుగుదును. ఆయన నిద్రపోతున్నారు ఎప్పుడు లేస్తారో ఏమో. ఎప్పుడు చూచినా పస్తులు ఛస్తున్నామనే మొత్తుకుంటావ్, నిజమేనటే ?"

"నిజంగాక అబద్ధం చెప్పను ఏంకర్మ రాదమ్మా ? మా బతుకులకి పస్తులుగాక పరమాన్నాలుంటాయా ? కూలికిపోతే కుండ కాలాలి లేక పోతే ఎండగాలాలి."

"ముగ్గురు పనిచేస్తున్నారు కదా, ఏంచేస్తున్నారే ఆ డబ్బంతా ?"

"ముగ్గురెక్కడిది తల్లీ, యీ పొద్దుటికి మూణ్ణాలాయె, కూతురు మంచాన పడ్డది."

"ఏమయిందే దానికి ?"

"కడుపు సించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఏంచెప్పను రాదమ్మా ! ఆ ముదనష్టపోడు అల్లుడు ముండాకొడుకు, దానికి రంకు రోగం తగి లించి మంచంపాలు చేశాడు. అది బాగుచేయించడానికి నేను చస్తున్నాను.

డాకటేరు దగ్గరికెళ్తే, పెంచిలీను సూదులు తెచ్చుకోమంటున్నాడు. ఏం పెట్టి తెచ్చేది తల్లీ? పూటే గడవడంలేదు" దాని గొంతు గాద్గదికమైంది.

రాధ ఇంట్లోకి తొంగిచూచింది. సింహాద్రి నిద్రపోతునట్టేవుంది. గొంతు తగ్గించి "ఒసే సిగ్గుమాలినదానా, ఇంటిగుట్టు ఇట్లా ఎవరన్నా రట్టు చేసుకుంటారఁటే? నా దగ్గిర అంటే అన్నావు సరిపోయింది ఎక్కడా అనకే పిచ్చిమొగమా" అంటూ రాధ మందలించింది.

"ఎక్కడంటే మాత్రం ఏం భయం తల్లీ. తవుడుతింటూ వయ్యారం పోవడం నాకు చేతకాదు, కుండ బద్దలు కొట్టినట్టు వున్నది న్నట్టు చెబుతాను, దానికేంగానీ, అయ్యగారు లేస్తే డబ్బు విషయం మరచిపోవాకు రాదమ్మా. నీకు పున్నెముంటుంది" అంటూ ఎల్లమ్మ సెలవు పుచ్చుకుంది.

"అలాగే లేవే" అంటూ రాధ ఇంట్లోకి వెళ్ళింది.

సింహాద్రి కళ్ళు తెరచి క్లోజప్పులో చూచాడు వసారా ఖాళీగావుంది. ఇంట్లో చూడటానికి ధైర్యం చాలలేదు. మెల్లగా లేచి బయటకు జారు కుంటున్నాడు. రాధ కేకేసింది. కళ్ళెం లాగినట్టు టక్కున ఆగిపొయ్యాడు సింహాద్రి. రాధ గబగబా దగ్గిరికొచ్చి, "దొంగలా మెల్లగా బయటకు జారుకుంటున్నారా?" అన్నది కసిగా.

సింహాద్రి మౌనం వహించేడు. అవతలపార్టీ అర్థం చేసుకుంటే ఆమౌనంలో చాలా ఆఅర్థాలే వున్నాయి. "నేను ఓడిపొయ్యాను. చేతులెత్తు తున్నాను. నన్ను అనవసరంగా చిత్రవధ చెయ్యకు" ఇన్ని మాటలూ అందులో అంతర్వాహికంగా వున్నాయి. కానీ అవతలపార్టీ అంత సుల భంగా ఎప్పుడూ అర్థంచేసుకోదు. అందుబాటులోవున్న శత్రువుని వూరికే ఎవరు మాత్రం వదులుతారు గనక?

"కల్యాణిని రేపన్నా ప్రయాణంచేసి పంపేది వుందికదా?"

అక్కడికి కల్యాణి ప్రయాణం విషయం తనకేమీ పట్టనట్టు! కరువులో అధికమాసం లాగా పదిహేనురోజులైంది, కల్యాణీ దాని

పిల్లలూ వచ్చి పీకలమీద కూచొని. వట్టి ప్రయాణంకాదు. దానికీ దాని పిల్లలకీ బట్టలు పెట్టి పంపాలి. తను ప్రయత్నిస్తూనే వున్నాడు. రాధకీ తెలుసు ఆ విషయం. వచ్చిన చిక్కేమిటంటే, ఆడవాళ్లు విమర్శమూలంగా ఆధిక్యత సంపాదించుకోవాలనుకుంటారు !

"చూద్దాం" సింహాద్రి నీళ్ళు నమిలేడు.

రాధకి మండింది. వినతిపత్రాలకి మంత్రులు జవాబిచ్చినట్టు, మామూలు మనుషులు జవాబిస్తే మండుతుంది మరి !

ఏమిటి చూస్తారు ? ఉదయంనుంచి పిల్లలు కాఫీకి మొగం వాచారు. రాత్రికి బియ్యంలేవు. పస్తు పడుకోవాలి. చూస్తూవుండండి. ఇంటిల్లిపాదీ కట్టకట్టుకొని ఏ బావిలోనన్నా దూకి చస్తాం. అదికూడా చూస్తూ కూచోండి. ఛీ, నాకు చావన్నా రావడం లేదు".

ఉద్రేకం ఎక్కువై రాధకి గొంతు పెగల్లేదు బాణంలా రివ్వున ఇంట్లోకి దూసుకపోయింది.